

పిడికిలెత్తి నినదిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

చలో నల్లగొండ సభ విజయవంతం

కాంగ్రెస్ సర్కారుకు ముచ్చెమటలు

అన్నదాతల కష్టాలకు కేసీఆర్ భరోసా

తీవ్ర ఆగ్రహావేశాలతో సాగిన ప్రసంగం

# గర్జించిన కేసీఆర్

నీళ్ల కోసం జంగ్ సైరన్



నల్లగొండ సభకు హాజరైన అశేష జనవాహిని

నిజామాబాద్, ఫిబ్రవరి 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉద్యమ నాయకుడు, తెలంగాణ తొలి సీఎం, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ గర్జించారు. చలో నల్లగొండ సభావేదికపై కేసీఆర్ చేసిన ప్రసంగం ఆద్యంతం అందరినీ ఆకట్టుకున్నది. ఇన్నాళ్లపాటు ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉన్న కేసీఆర్ తన ప్రసంగంలో ఎక్కడా మాట దొర్లకుండా మర్యాదగా మెదులుతూ వచ్చారు. కానీ రెండున్నర నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇష్టానుసారంగా బాధ్యతను మరిచి మాట్లాడుతుండడం, ఇచ్చిన హామీలకు ఎగనామం పెడుతుండడంతో కేసీఆర్ స్పందించారు. మొత్తానికి తెలంగాణ రైతన్నల ఆత్మగౌరవానికి, వారి జీవనోపాధిని దెబ్బకొట్టేలా జల సంక్షోభంపై జంగ్ సైరన్ మోగించి కృష్ణా నదీ జలాల హక్కుల కోసం జై కొట్టి ఉద్యమ పంథాకు శ్రీకారం చుట్టారు. ఆనాడు ఉద్యమంలో వాగ్బాణాలతో యావత్ తెలంగాణ జనాలను ఆకర్షించగా ఇప్పుడు అదే స్థాయిలో ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ స్పందించిన తీరు సర్వత్రా ఆకర్షించింది. సీఎం సీట్లో కూర్చున్న రేవంత్ రెడ్డి చేస్తున్న యాగిని, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరును కేసీఆర్ తన ప్రసంగంలో తేటతెల్లం చేశారు. దాదాపుగా ముప్పావు గంటసేపు సాగిన కేసీఆర్ ప్రసంగాన్ని యావత్ రాష్ట్రమంతా ఆసక్తిగా ఎదురుచూసి వీక్షించింది. ఇందులో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన జనాలు సైతం టీవీల్లో కేసీఆర్ ప్రసంగాన్ని చూసి ఆలోచనలోపడ్డారు.



ఎల్లారెడ్డి నుంచి నల్లగొండ సభకు బయల్దేరిన మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యం, కార్యకర్తలు

### ఓపిక పట్టి... విరుచుకుపడి...

డిసెంబర్ 3న అసెంబ్లీ ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ 64 సీట్లతో అధికారాన్ని దక్కించుకున్నది. డిసెంబర్ 7న బాధ్యతలు చేపట్టిన తర్వాత నాటి నుంచి ఇప్పటి వరకు ఇచ్చిన హామీల అమలుకు, గత ప్రభుత్వం అమలు చేసిన పనుల కన్నా మిన్నగా పరిపాలన చేయాల్సింది పోయి ఎంతసేపూ ఆరోపణలతోనే కాంగ్రెస్ పాలకులు సమయాన్ని గడిపేస్తున్నారు. చీటికిమాటికి గత ప్రభుత్వాన్నే టార్గెట్ చేస్తూ పోవడం తప్ప 420 హామీల సంగతిని మాత్రం కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవడం లేదు. అడిగితే రైతులు, సామాన్యులపైనే ఆ పార్టీ పెద్దలంతా విరుచుకు పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి సమయం ఇచ్చిన దరిమిలా కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించడంతో కేసీఆర్ రంగప్రవేశం చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, హక్కులను కాపాడేందుకు ముందడుగు వేసి చలో నల్లగొండకు పిలుపునిచ్చారు. ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంత ప్రజాప్రతినిధులు, ప్రజలతో ఊహించని స్థాయిలో బహిరంగ సభను నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపారు. అంతేకాకుండా తనదైన శైలిలో ఆరోపణ అస్త్రాలను సంధించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది.

### గోదావరి పరీవాహకంపైనా ఆందోళన...

ఉత్తర తెలంగాణ వరప్రదాయినిగా నిలిపిన కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒక చిన్న భాగమైన మేడిగడ్డలోని పిల్లర్‌ను భూతద్దంలో పెట్టి చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీ తీరును కేసీఆర్ ఎండగట్టారు. కాళేశ్వరం భారీ ప్రాజెక్టులోని రిజర్వాయర్లు, టన్నెళ్లు, కాలువల సంగతిని విశదీకరించారు. అంతేకాకుండా కాళేశ్వరం పేరిట సమయాన్ని వృథా చేస్తూ రైతులకు సాగుకు నీళ్లు ఇవ్వకుండా చోద్యం చూస్తున్న తీరును కేసీఆర్ వివరించారు. మిడ్‌మానేరు, లోయర్ మానేరు డ్యాంలో నీటి నిల్వ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూనే పరీవాహక ప్రాంత రైతుల దుస్థితిపైనా కదం తొక్కారు. చలో నల్లగొండతోనే ఆగదని... ఈ పంథా రాష్ట్రమంతటా కొనసాగుతున్నదని కేసీఆర్ ఢంకా బజాయించి చెప్పారు. ప్రజల కోసం కట్టె కాలేదాకా... కొట్లాడతానంటూ కేసీఆర్ చెప్పడంతో ప్రతిఒక్కరూ భావోద్వేగంతో స్పందించారు. సాగుకు కరెంట్ ఇవ్వ చేతకాని కాంగ్రెస్ పార్టీ నాయకులందరూ రాజకీయ ఆరోపణలకే పరిమితమవుతున్నారని మండిపడ్డారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు తానెప్పుడూ ముందుంటానని, తెలంగాణకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోనంటూ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల తీరుపై సంధించిన వాగ్బాణాలకు ప్రజల నుంచి మంచి స్పందన వ్యక్తమైంది. వచ్చిన రెండు నెలలకే కరెంట్ కోతలు మొదలయ్యాయని, ఇదీ కాంగ్రెస్ పాలకుల రీతికి అద్దం పడుతున్నదని కేసీఆర్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేసీఆర్ తొలి ప్రసంగం విశేష స్పందనను రాబట్టింది.

# నేడు వసంత పంచమి

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు
### మండపాల్లో పెళ్లిళ్ల సందడి



సుభాష్‌నగర్, ఫిబ్రవరి 13: చదువుల తల్లి సరస్వతి దేవీ జన్మతిథి పంచమి పురస్కరించుకొని బుధవారం జిల్లాలో వివాహాలు, అక్షరాభ్యాసాలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కోటగల్లి మార్కండేయ మందిరం, సరస్వతి శిశుమందిర్, న్యాల్‌కల్‌రోడ్ లలితాదేవి ఆశ్రమాలయం, భవానీనగర్ తుల్జాభవానీ... తదితర దేవీ ఆలయాలు ముస్తాబయ్యాయి.

**వసంత పంచమి విశిష్టత..**

సరస్వతీదేవిని మాఘ పంచమి రోజు శ్రీపంచమి పేరిట ఆరాధించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. వసంతపంచమి రోజు పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తే జ్ఞానరాశులు అవుతారని ప్రతీతి. సరస్వతీమాత ఆరాధనతో వాక్‌శుద్ధి, జ్ఞానాభివృద్ధి, సత్‌బుద్ధి, మేధా సంపద, ఆలోచన, ప్రతిభ, ధారణ, ప్రజ్ఞ... తదితర శుభాలు కలిగి భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత విద్యలో రాణిస్తారని విశ్వాసం. వాగీశ్వరీ, మహాసరస్వతి, సిద్ధ సరస్వతి, నీల సరస్వతి, ధారణాసరస్వతి, బాల సరస్వతి రూపాల్లో చదువుల తల్లిని తెల్లనిపూలతో పూజించడంతో సకల విద్యలు నేర్చుకుంటారని పురాణ వచనం.

**శుభ ముహూర్తం..**

తిథులలో పంచమి, వారాలలో బుధవారం, నక్షత్రాలలో రేవతి, గృహ, వివాహ కార్యాలకు అత్యంత అనుకూలమైన శుభముహూర్తం వసంత పంచమి. దీంతో బుధవారం జిల్లాలో వందలాది వివాహాలు జరగనున్నాయి. రైల్వేస్టేషన్, బస్టాండ్ కల్యాణమండపాలు పెండ్లిళ్ల సందడితో కిటకిటలాడుతున్నాయి.

## పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించాలి

### 18 రకాల చేతివృత్తులవారు అర్హులు : కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



మాట్లాడుతున్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 13: సాంప్రదాయ, చేతివృత్తుల వారిని అన్నివిధాలా ప్రోత్సహించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన అర్హులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పీఎం విశ్వకర్మ పథకంపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్, జిల్లా పరిశ్రమల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొని పథకం ఉద్దేశం, ప్రయోజనాలను వివరించారు. 18 కేటగిరీలకు చెందిన చేతివృత్తులు, హస్తకళాకారులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గత ఐదేండ్లలో ప్రభుత్వ రుణాలు పొందని, 18 నుంచి 60 ఏండ్లలోపువారు అర్హులని వవరించారు. ముద్ర, స్వనిధి లబ్ధిదారులు రుణాలను మొత్తం చెల్లిస్తే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. సదస్సులో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సురేశ్‌కుమార్, ఎంఎస్ఎంఈ అధికారి రాజేశ్‌యాదవ్, బీసీ సంక్షేమాధికారి రమేశ్, ఎస్.సిద్ధయ్య, పంచాయతీ కార్యదర్శులు, సీఎస్సీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## ముగ్గురు మున్సిపల్ కమిషనర్ల బదిలీ

కామారెడ్డి/ఆర్మూర్‌టౌన్/ ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 13: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్ల బదిలీ చే పట్టారు. ఇందులో భాగంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ సంగారెడ్డి మున్సిపల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మర్రిపెడ నుంచి ఎ.రాజు బదిలీపై వస్తున్నారు. కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌ను మెదక్ జిల్లా రామాయంపేటకు, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ జీవన్‌ను నారాయణ్ ఖేడ్‌కు బదిలీచేశారు. కాగా కామారెడ్డి, ఎల్లా రెడ్డి మున్సిపల్ కమిషనర్లుగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి, సీపీలు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 13: యువతే దేశ భవిష్యత్తు అని, అలాంటి యువత రోడ్డు ప్రమాదాల బారినపడి ఉజ్వల భవిష్యత్తును కోల్పోకూడదని నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల సూచించారు. 35వ రోడ్డు భద్రతా మాసోత్సవాలు, మేఘనా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్ ఆధ్వర్యంలో ఓరల్ అండ్ మ్యాక్సీల్లో ఫేషియల్ సర్జన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రభుత్వ దవాఖాన వద్ద జడ్జి సునీత కుంచాల, సీపీ కల్మేశ్వర్ సింగెనవర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. చట్టాలను గౌరవించి వాటిని పాటించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. సీపీ కల్మేశ్వర్ సింగెనవర్ మాట్లాడుతూ నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాల్లో సుమారు 320 మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. డెంటల్ కాలేజీ విద్యార్థులకు రీజినల్ ట్రాన్స్‌పోర్టు శాఖ ద్వారా స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిచంద్, అదనపు డీసీపీ జయరాం, ప్రొబెషనరీ ఐపీఎస్ బి.చైతన్యా రెడ్డి, ఏసీపీలు నారాయణ, కిరణ్‌కుమార్,అరుణ్ కుమార్, ట్రాఫిక్ సీఐ వెంకట్ నారాయణ, ఆర్ఐ సతీశ్, డాక్టర్లు కల్యాణచక్రవర్తి, అమర్‌నాథ్, ప్రవీణ్ కుమార్, శోభారాణి, సాయిచంద్ పాల్గొన్నారు.



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్

## అయోధ్యకు బయల్దేరిన ప్రత్యేక రైలు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 13: నిజామాబాద్ నుంచి అయోధ్యకు వెళ్లే ప్రత్యేక రైలును ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. ఈ రైలులో పార్లమెంట్ పరిధిలోని వివిధ నియోజకవర్గాల నుంచి 144 మంది భక్తులు అయోధ్యకు వెళ్లారు. భక్తులకు ధన్‌పాల్ లక్ష్మీబాయి-విఠల్ గుప్తా ట్రస్టు ఆధ్వర్యంలో భోజనం, వాటర్ బాటిళ్లు అందజేశారు.



## బాల్యం బందీ

**ఆడుతూ పాడుతూ** గడపాల్సిన బాల్యం చెత్తకుప్పల పాలవుతున్నది. అక్షరాలు దిద్దాల్సిన చేతులు చిత్తుకాగితాలు ఏరుకుంటున్నాయి. కడుపు నింపుకొనేందుకు కంపులో జీవిస్తున్నాయి. నిజామాబాద్ జిల్లా మానిక్‌భండార్ సమీపంలో ఇద్దరు చిన్నారులు పాఠశాల తెరిచి ఉండగానే చెత్త ఏరుతున్న దృశ్యాలను 'నమస్తే' క్లిక్‌మనిపించింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

# తరగతులు ఐదు.. సారు ఒక్కరే..

### అక్రమ డిప్యుటేషన్లతో అందని చదువులు
### ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత
### డిప్యుటేషన్లు రద్దు చేయాలని సూచించిన ఎమ్మెల్యే
### అయినా స్పందించని అధికారులు

**జిల్లాలోని** ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్య కొంతకాలంగా వేధిస్తున్నది. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా తగినంతమంది టీచర్లు లేకపోవడంతో బోధన కుంటుపడుతున్నది. ప్రధానంగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు నడిచే ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో నాణ్యమైన విద్య అందని ద్రాక్షగా మారుతున్నది. మరోవైపు మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు అన్న చందంగా.. అక్రమ డిప్యుటేషన్లతో ఉన్న కాస్త ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించడంతో తరగతులు ఎన్ని ఉన్నా బోధించే ఉపాధ్యాయులు ఒక్కరే కావడం గమనార్హం.

– నిజాంసాగర్, ఫిబ్రవరి 13



మంగ్లూర్ పాఠశాలలో ఐదు తరగతులకు ఒకేచోట పాఠాలు బోధిస్తున్న ప్రధానోపాధ్యాయుడు యశ్వంత్

డిప్యుటేషన్ల పేరిట నిజాంసాగర్ మండలానికి చెందిన ఉపాధ్యాయులు ఇతర మండలాల్లో విధులు నిర్వర్తిస్తుండడంతో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడుతున్నది. నిజాంసాగర్ మండలంలోని మంగ్లూర్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 60 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు యశ్వంత్‌తో పాటు ఉపాధ్యాయులు మురళీ, ఫరీదా ఉన్నారు. ప్రస్తుతం యశ్వంత్ ఒక్కరే ఐదు తరగతులకు పాఠాలు బోధిస్తున్నారు. మురళి పైచదువుల కోసం దీర్ఘకాలిక సెలవులో వెళ్లగా, ఫరిదా డిప్యుటేషన్‌పై అచ్చంపేట పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. నర్సింగ్‌రావ్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు సుమారు 80మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు ఉండగా, వారిలో ఇద్దరు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులందరినీ ఒకే తరగతి గదిలో కూర్చుండబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. దీంతో పాఠాలు అర్థం కావడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. గున్కుల్ పాఠశాలలో విధులు నిర్వహించే ఓ ఉపాధ్యాయురాలు నస్రుల్లాబాద్‌లో, అచ్చంపేటలో విధులు నిర్వహించే ఓ ఉపాధ్యాయుడు కామారెడ్డిలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. ఇదిలా ఉండగా ఇటీవల డిప్యుటేషన్లను రద్దు చేసి ఎక్కడి వారు అక్కడే విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అయినా ఎలాంటి స్పందన లేకపోవడం విడ్డూరం. ఇప్పటికైనా డిప్యుటేషన్లను రద్దు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### ఉపాధ్యాయుల కొరత తీర్చాలి..



మా ఊరి పాఠశాలలో సుమారు 60 మంది విద్యార్థులు చదువుతుండగా ప్రస్తుతం ఒక్కరే సారు ఉన్నారు. దీంతో విద్యార్థులకు పాఠాలు అందకుండా పోతున్నాయి. మా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపించడంతో కొరత ఏర్పడింది. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి డిప్యుటేషన్లను రద్దు చేయాలి.

**- గైని రమేశ్, మంగ్లూర్ గ్రామస్తుడు**

### ఇద్దరు డిప్యుటేషన్‌పై వెళ్లారు..



మా పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు ఉండగా వారిలో నుంచి ఇద్దరిని అచ్చంపేట పాఠశాలకు పంపించారు. ప్రస్తుతం ముగ్గురు ఉపాధ్యాయులమే పాఠాలు బోధిస్తున్నాం. ఇద్దరు ఉపాధ్యాయులను అచ్చంపేటకు పంపిస్తే వారిలో నుంచి ఒకరు కామారెడ్డికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఉపాధ్యాయుల కొరత మాట వాస్తవమే. దీంతో ఒక్కోసారి విద్యార్థులందరికీ ఒకేచోట బోధించాల్సి వస్తుంది.

**- రఘు, ప్రధానోపాధ్యాయుడు, నర్సింగ్‌రావ్‌పల్లి**